

ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న గురుద్వారా ప్రబంధక్ కమిటీ సభ్యులు

బైశాఖి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

అమీర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గురుద్వారా ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న బైశాఖీ ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారితో కలిసి ప్రబంధక్ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ ఉత్సవాలను వేలాది మంది సిక్కులు వచ్చే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు చెప్పనున్నట్లు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, అధికారులు

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి

బోరబండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని, ప్రజలు సహకరించాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ పనుల్లో భాగంగా ఆస్తులు కోల్పోతున్న వారితో ఆయనతో పాటు జీహెచ్ఎంసీ రహదారి విస్తరణ నిపుణుడు రవీందర్, సర్కిల్-19 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ఎన్.ప్రసీధ యూసుఫ్‌గూడ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ.. ఆస్తులు కోల్పోతున్న వారికి పరిహారం చెక్కులను త్వరగా అందించాలని అధికారులను కోరారు. విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం కింద డబ్బుచెల్లింపు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, బాధితులు టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్మెంట్ రైట్స్)కు అంగీకరిస్తే పనులు త్వరగా పూర్తి చేయవచ్చని ఏసీపీ ప్రసీధ సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ గొట్టె నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



వైట్‌థాన్-2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

కంటి క్యాన్సర్‌పై అవగాహనకు 18న వైట్‌థాన్

బంజారాహిల్స్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కంటి క్యాన్సర్‌పై అవగాహన, నిధుల సేకరణ నిమిత్తం ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో వైట్‌థాన్-2025 నిర్వహించనున్నారు. బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ డాక్టర్ స్వాతి కలికి మాట్లాడుతూ.. కంటి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహిస్తున్నామన్నారు. మొదట్లోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. కంటి క్యాన్సర్‌తో పోరాడుతున్న పేద పిల్లలకు ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన రన్ ద్వారా సమీకరించిన నిధులతో ఉచితంగా మూడు వేలకు పైగా చికిత్సలు అందించామని.. ఇలాంటి కేసుల్లో 90 శాతం మంది పిల్లల ప్రాణాలు కాపాడగలిగామన్నారు. అయితే చికిత్సకు ఆలస్యంగా రావడం వల్ల కేవలం 45 శాతం కేసుల్లో మాత్రమే చూపు తేగలిగామన్నారు. ప్రాథమిక దశలో రెటినోబ్లాస్టోమాను గుర్తించగలిగితే సులభంగా చికిత్స అందించవచ్చని ఆమె పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డీజే.. పబ్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అర్థరాత్రి దాటిన తర్వాత పెద్ద శబ్ధాలతో డీజే నిర్వహిస్తున్న పబ్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లోని జింగ్ స్కై బార్ లాంజ్‌లో ఈ నెల 7న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలను విరుద్ధంగా డీజే నిర్వహిస్తున్నట్టు తేలడంతో బార్ మేనేజర్ రాబిన్ సహాయ్, సెక్యూరిటీ మేనేజర్ బాలినేని రామానుజులు, డీజే ఆపరేటర్ బోగటి నరేన్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని డీజే పరికరాలను సీజ్ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని బెస్ట్ అండ్ మాల్ సెల్లార్‌లో ఎలక్ట్రానిక్ సిగరెట్ల విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా మాదాపూర్‌కు చెందిన సంభవ్ జైన్ ఈ సిగరెట్లను అమ్ముతున్నట్టు తేలింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఢిల్లీకి చెందిన వ్యక్తి ఈ సిగరెట్లను సరఫరా చేస్తున్నట్లు తేలింది. పోలీసులు సంభవ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఎలక్ట్రానిక్ సిగరెట్ల సగంజామాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. సరఫరాదారుడు యశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో గొడవ.. ఏడు రోజులు జైలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రోడ్డుపై వెళ్తున్న వారితో గొడవకు దిగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తికి కోర్టు ఏడు రోజుల జైలు శిక్ష విధించింది. ఫిలింనగర్‌కు చెందిన జె.సతీష్ మద్యం తాగి రోడ్డుపై రాకపోకలు సాగించే వారితో నిత్యం గొడవలకు దిగేవాడు. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు సతీష్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి జడ్జి ఎదుట హాజరుపరచగా ఏడు రోజుల జైలు శిక్ష విధించారు.

అనారోగ్యంతో ఫిజియోథెరపిస్ట్ మృతి

అమీర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఫిజియోథెరపీ వైద్యురాలు మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన సుస్మిత ప్రియ (30) సంవత్సరం నుంచి ఎస్ఆర్‌నగర్‌లోని ఉమెన్స్ హాస్టల్లో ఉంటూ బల్కంపేటలోని ఓ చైల్డ్‌కేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఫిజియోథెరపీ వైద్యురాలిగా పనిచేస్తోంది. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం 8 గంటలకు హాస్టల్ నుంచి విధులకు బయలుదేరుతుండగా నురగలు కక్కుతూ ఒక్కసారిగా కింద పడిపోయింది. హాస్టల్ నిర్వాహకులు 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నగరానికి చేరుకున్న ఆమె తల్లితండ్రులు తన కుమార్తెకు గుండె సంబంధిత సమస్య ఉందని పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

‘రాజీవ్ యువవికాసం’తో స్వయం ఉపాధి

- మరో ఐదు రోజుల్లో ముగియనున్న దరఖాస్తుల గడువు
- సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్న అధికారులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా అర్హులైన యువత నుంచి రుణాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం ద్వారా జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన అధికారులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన వారు ఆ ప్రతులను వార్డు కార్యాలయాల్లో అందజేయాలని సూచిస్తున్నారు. 50 వేల రూపాయల నుంచి 4 లక్షల రూపాయల వరకు రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించగా అందులో వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం భారీ సబ్సిడీ అందజేస్తోంది. రూ.50 వేల వరకు రుణాలు తీసుకున్న వారికి ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఇవ్వనుంది. రూ.50 వేల నుంచి రూ.1లక్ష వరకు 90 శాతం.. రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం.. రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీపై రుణాలు అందించనున్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచిస్తున్నారు.

జంట సర్కిళ్లలో 485 దరఖాస్తులు

రుణాల కోసం దరఖాస్తు చేయడానికి వయస్సు 22 నుంచి 55 సంవత్సరాల లోపు ఉండాలని నిర్ధారించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి ఆయా కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేయనుంది. జీహెచ్ఎంసీ జంట సర్కిళ్లయిన ఖైరతాబాద్, జూబ్లీహిల్స్‌లలో ఇప్పటి వరకు 485 దరఖాస్తులు వచ్చాయి. ఖైరతాబాద్ సర్కిల్‌లో 179 దరఖాస్తులు అందగా.. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 306 మంది దరఖాస్తు చేసుకున్నారు. వార్డు కార్యాలయాల్లో రాజీవ్ యువశక్తి రుణాల కోసం దరఖాస్తులను తీసుకుంటుండగా.. మీ సేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, ఫొటో అందజేయాల్సి ఉంటుంది. రేషన్ కార్డు లేని వారు ఆదాయ ధృవీకరణ పత్రం విధిగా జత చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కుల ధృవీకరణ పత్రం తెలంగాణ ఏర్పాటు అనంతరం తీసుకొని ఉండాలని, ఆదాయ ధృవీకరణ పత్రం సంవత్సరం లోపు తీసుకొని ఉండాలని సూచించారు.

దరఖాస్తుల పరిశీలన ఇలా

ఈ నెల 14 వరకు వచ్చిన దరఖాస్తులను మొదట జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూసీల వారీగా విభజించి ఆయా కార్పొరేషన్ల ద్వారా ఆన్‌లైన్ ఎంట్రీ చేయనున్నారు. అనంతరం స్క్రుటినీ కోసం మండల స్థాయి కమిటీకి అందజేస్తారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ నేతృత్వంలో మండల స్థాయి కమిటీ విచారిస్తుంది. ఈ కమిటీలో ఆయా కార్పొరేషన్ల ప్రతినిధులు, యూసీడీ విభాగం కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రెవెన్యూ విభాగం అధికారులు, బ్యాంకు మేనేజర్లు ఉంటారు. ఈ స్థాయిలో విచారించి అర్హులుగా నిర్ధారిస్తే వాటిని జిల్లాస్థాయి కమిటీ మరోసారి విచారించి తుది జాబితాను ప్రకటిస్తుంది. ఈ ప్రక్రియ మే నెల 28వ తేదీ లోపు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకోగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజైన జూన్ 2న అర్హులకు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంది.



ఖైరతాబాద్ వార్డు కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మహిళల హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌ల చోరీ

బోరబండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మహిళల హాస్టళ్లోకి చొరబడిన దొంగ యువతుల ల్యాప్‌టాప్‌లను చోరీ చేశాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన సింధు(29) ఓ సంస్థలో ఉద్యోగం చేస్తూ మధురానగర్‌లోని శ్రీసాయి సద్గురు ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటుంది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 3 గంటల సమయంలో ఓ దొంగ హాస్టల్‌లోని ఆమె గదిలోకి ప్రవేశించి ల్యాప్‌టాప్ తీసుకుని ఉడాయించాడు. తెల్లవారిన తర్వాత చూసుకుంటే తన ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించకపోవడంతో ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరికి చెందిన యువతి కె.మనస్వి (24) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ మధురానగర్‌లోని రామిరెడ్డి ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటుంది. సోమవారం రాత్రి మనస్వి నిద్రలో ఉండగా ఆమె గదిలోకి చొరబడిన దొంగ ల్యాప్‌టాప్, ఛార్జర్, విలువైన వస్తువులు ఉన్న బ్యాగును చోరీ చేశాడు. రెండు హాస్టళ్లలో చోరీచేసి బ్యాగులతో దొంగ ఉడాయించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఓ హాస్టల్లో వాచ్‌మెన్ లేకపోవడం, మరో హాస్టల్లో వాచ్‌మెన్ నిద్రపోవడంతో దొంగ హాస్టల్లోకి ప్రవేశించాడని యువతులు పేర్కొన్నారు. హాస్టళ్ల నిర్వాహకులు తమ భద్రతను గాలికి వదిలేశారని యువతులు వాపోయారు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ నల్లా కనెక్షన్లను అడ్డుకోవాలి

బంజారాహిల్స్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్ బస్తీ అంజనేయ స్వామి ఆలయం సమీపంలో కొన్ని రోజులుగా సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. పాత రోడ్డును తొలగించే క్రమంలో కొందరి నల్లా పైపులు పగిలిపోయాయి. అయితే వాటిని తిరిగి ఏర్పాటు చేసుకునే ముసుగులో కొంత మంది అక్రమంగా నల్లా కనెక్షన్లు పొందుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జలమండలి, విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా అక్రమంగా ఏర్పాటు చేసిన నల్లాలను తొలగించారు. అయితే తాజాగా సీసీ రోడ్డు వేసేందుకు ఒక లేయర్ కాంక్రీట్ వేయగా దాన్ని తవ్వేసి కొంత మంది రాత్రికి రాత్రే నల్లాలు పొందుతున్నారు. ఈ విషయాన్ని మరోసారి బస్తీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే విజిలెన్స్ అధికారులు రావడం లేదంటూ క్షేత్ర స్థాయి సిబ్బంది చెబుతున్నారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా సీసీ రోడ్డు వేసిన తర్వాత వీటిని తొలగించడం కష్టమని, ఇప్పుడే వాటిని గుర్తించాలని వారు కోరుతున్నారు. అక్రమ కనెక్షన్లను ఇలాగే వదిలేస్తే భవిష్యత్లో బస్తీలోని వారందరికీ నీటి సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అక్రమ నల్లా కనెక్షన్ కోసం సీసీ రోడ్డును తవ్వుతున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బీఆర్ఎస్ నాయకుడి మృతదేహానికి ఎమ్మెల్యేల నివాళి

బేగంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనే సత్యనారాయణ మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సి.సత్యనారాయణ మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు కార్పొరేటర్ మహేశ్వరితో బుధవారం బేగంపేటలోని వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల వెంట బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, సురేష్‌యాదవ్, తాళ్ల రాజయ్య, నరేందర్‌రావు, నరేష్, సురేష్ ఉన్నారు.

విమానాశ్రయం ఆవరణలోకి చెత్తను విసరొద్దు

- ఎయిర్‌పోర్టు సమీపంలోని నివాసితులకు అవగాహన కల్పించిన అధికారులు

బేగంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విమానాశ్రయం ఆవరణలో ఆహార వ్యర్థాలు, చెత్త వేయవద్దని ఎయిర్‌పోర్టు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. బేగంపేట ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు, బేగంపేట సర్కిల్ జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది విమానాశ్రయం సమీపంలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్, తాతాచారి కాలనీ, భగత్‌సింగ్‌నగర్ తదితర బస్తీలకు చెందిన ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. విమానాశ్రయం ప్రహరీ పక్కన ఉన్న బస్తీల ప్రజలు నిత్యం మిగిలిన ఆహార పదార్థాలతో పాటు చెత్తను గోడ అవతలకు విసిరేస్తున్నారని, దీని వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు చెప్పారు. ఆహారం కోసం పక్షులు రావడంతో విమానాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. స్థానికులు సమస్యను గుర్తించి చెత్తను ఎయిర్‌పోర్టులోకి వేయవద్దని సూచించారు. జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన ఆటోలో చెత్తను వేయాలని, ఈ విషయంపై సర్కిల్ డీసీ డాకు నాయక్ పలుసార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని శానిటేషన్ అధికారులు ఎస్ఎస్ ధన గౌడ్, జవాన్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా డప్పు వాయిస్తూ పలు బస్తీల్లోని ప్రజలను కలిసి అధికారులు అవగాహన కల్పించారు.



భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎయిర్‌పోర్టు అధికారులు, శానిటేషన్ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న సాధ్వి మాతా నిర్మలానంద యోగ భారతి

మే 18న గోశాలల నిర్వాహకుల సదస్సు

పంజాగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తాము నిత్యం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని గోశాలల నిర్వాహకులు, గో పోషకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి మే 18న లక్డీకాపూల్‌లోని వాసవిసేవా కేంద్రంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గోశాలల నిర్వాహకులు, గో పోషకుల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేణుగోపాల మందిర్ గోశాల నిర్వాహకులు సాధ్వి మాతా నిర్మలానంద యోగ భారతి, గ్రామ భారతి నిర్వాహకులు ఆకుతోట రామారావు, శ్రీకామధేను గోవర్ధనగిరి గో విజ్ఞాన అనుసంధాన సంస్థ నిర్వాహకులు డాక్టర్ మురళీధర్ తదితరులు వివరాలను వెల్లడించారు. పశువైద్యం, పశుగ్రాసం, పోషణ, ఆశ్రయం, గోవుల సంరక్షణ గురించి వారు వివరించారు. పొరుగు రాష్ట్ర ప్రభుత్వాలు గోశాలల నిర్వాహకులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను తెలంగాణ ప్రభుత్వం సైతం అందించాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మే నెల 18న సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని సదస్సుకు ఆహ్వానిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గోశాలల నిర్వాహకులు, గో పోషకులు, గో ప్రేమికులు తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 9052286688, 8374662262 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో శ్రీకృష్ణ గోసేవ ట్రస్ట్ ప్రతినిధి కె.శ్రీధర్, లవ్ ఫర్ కౌ సంస్థ ప్రతినిధి జస్మత్ పటేల్, గోవత్స్ ఫౌండేషన్ ప్రతినిధి మురళి పలోడ్, సురభి ఫౌండేషన్ ప్రతినిధి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

15న ‘మన ఆలోచన సాధన సమితి’ ఆవిర్భావ సభ

పంజాగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీసీలలో చైతన్యం తీసుకురావడానికి రాజకీయాలకు అతీతంగా మన ఆలోచన సాధన సమితి(మాస్)ని ఏర్పాటు చేశామని సమితి వ్యవస్థాపకుడు కటకం నర్సింగ్‌రావు తెలిపారు. ఈ నెల 15న నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో మన ఆలోచన సాధన సమితి ఆవిర్భావ సభను నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి సభ్యులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ నాయకులను ఎదగనీయకుండా ఒక పద్ధతి ప్రకారం రాజకీయ కుట్ర జరుగుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా సమితి ఏర్పాటు చేస్తున్న క్రమంలో తాను బీజేపీకి రాజీనామా చేశానన్నారు. ఆవిర్భావ సభలో మేధావులు, రచయితలు, కళాకారులు, వైద్యులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆవిర్భావ సభలో పలు నిర్ణయాలు, తమ కార్యాచరణ, విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో సమితి సభ్యులు దొంత ఆనందం, దేవేందర్, జి.నర్సింహగౌడ్, పి.నర్సింహ, బ్రహ్మయ్య రజక, అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింగ్‌రావు తదితరులు

విద్యుత్ శాఖకు చెందిన నిచ్చెన చోరీ.. కేసు నమోదు

పంజాగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సోమాజిగూడలోని ఓ ఆసుపత్రిలో వైద్యుడి బూట్ల చోరీ ఘటన మరువక ముందే విద్యుత్ శాఖకు చెందిన అల్యూమినియం నిచ్చెనను అగంతకులు చోరీ చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వర్షం పడటంతో పంజాగుట్ట ప్రతాప్ నగర్‌లో కరెంట్ పోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు గ్రీన్‌ల్యాండ్స్‌లోని విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతుల నిమిత్తం ప్రతాప్‌నగర్ వచ్చారు. స్తంభం ఎక్కడానికి అల్యూమినియం నిచ్చేనను తీసుకొచ్చారు. నిచ్చేనను ప్రతాప్‌నగర్ ప్రధాన రహదారిలో నిచ్చెనను పెట్టి ఎక్కడ అంతరాయం ఏర్పడిందో తనిఖీ చేస్తూ బస్తీ లోపలికి వెళ్లారు. లోపాన్ని గుర్తించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తిరిగి బస్తీ ప్రధాన రహదారి వద్దకు వచ్చి చూడగా నిచ్చెన కనిపించలేదు. దీంతో విద్యుత్ సిబ్బంది రూ.20 వేల విలువైన నిచ్చెనను దొంగిలించారని పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం చేసిన ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరిట యువతిని మోసం చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన వి.సీతామహాలక్ష్మి కుమార్తె ఐశ్వర్య 2023లో బీటెక్ పూర్తి చేసింది. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తుండగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36కు చెందిన త్రిసూన్ టెక్నాలజీస్ నుంచి తుమ్మ దివ్యవాణి ఫోన్ చేసి తాము పలు కోర్సులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పింది. ఈ మేరకు తల్లి కుమార్తెలు సంస్థ డైరెక్టర్లు మురారి హనీషా, బచ్చు వెంకట శివరామకృష్ణారెడ్డి, కన్సల్టెంట్ దివ్యవాణిలను కలిశారు. శిక్షణ తీసుకునేందుకు పలు దఫాలుగా రూ.2.50 లక్షలు చెల్లించారు. ఆరు నెలల శిక్షణ కాలంలో రూ.30,000 స్టైపెండ్ ఆ తర్వాత ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. రోజులు గడుస్తున్నా ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. కంపెనీ నిర్వాహకులను పలు మార్లు నిలదీయాగా రూ.1.65 లక్షలు తిరిగి ఇచ్చేశారు. మిగతా డబ్బు ఇవ్వకపోగా సిబ్బందితో బెదిరింపులకు పాల్పడుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కవితపై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- యునైటెడ్ పూలే ఫ్రంట్ ప్రతినిధులు

పంజాగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇందిరా పార్కు వద్ద దీక్ష చేపడితే కాంగ్రెస్ నాయకులు ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారని యునైటెడ్ పూలే ఫ్రంట్, పలు బీసీ కుల సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరా పార్కును ఫినాయిల్‌తో కడగడం కాదని, వారి నోళ్లను ఫినాయిల్‌తో కడుక్కోవాలని హితవు పలికారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్రంట్ కో కన్వీనర్ శివశంకర్, వివిధ సంఘాల నాయకులు యాదగిరి ముదిరాజ్, ఎ.మారయ్య, ఆలకుంట హరి, అశోక్‌యాదవ్ తదితరులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు చిల్లరగా వ్యవహరిస్తున్నారని, ఓ ఎంపీ, మంత్రి పదవి ఆశిస్తున్న ఓ ఎమ్మెల్యే, గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవి పొంది, ప్రస్తుతం పదవి ఆశిస్తున్న మరో నాయకుడు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, బీఆర్ఎస్ ప్రభుత్వం కులవృత్తులను బలోపేతం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నాశనం చేస్తుందని ఆరోపించారు. బీసీ బిల్లుల ఆమోదానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయట్లేదని, ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానని సీఎం అసెంబ్లీలో చెప్పి కొందరిని ఢిల్లీ తీసుకెళ్లి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ నాయకుల నోళ్లను ఫినాయిల్‌తో కడగాలన్నారు.

ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

బోరబండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అసిస్టెంట్ డైరెక్టర్‌ను మోసం చేసిన ఎడిటర్‌పై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాకు చెందిన యువతి(20) 2023 ఆగస్టులో పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరింది. ఆ సమయంలో రహ్మత్‌నగర్‌లో నివసించే వరంగల్ జిల్లా తొర్రూరుకు చెందిన ఎడిటర్ ఆవుల నిఖిల్ (28)తో పరిచయం ఏర్పడింది. 2024 జనవరిలో ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో అంగీకరించింది. తన పుట్టిన రోజని చెప్పి గతేడాది ఎస్ఆర్‌నగర్‌లోని తన స్నేహితుడి రూమ్‌కు ఆమెను తీసుకెళ్లి శారీరకంగా కలిశాడు. ఆ తర్వాత గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. అయితే కొన్ని నెలల తర్వాత నిఖిల్ మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధపడగా యువతి అడ్డుకొని నిఖిల్ కుటుంబ సభ్యులకు విషయం వివరించింది. ఆ తర్వాత నగరానికి వచ్చిన ఆమె తనను పెళ్లి చేసుకోకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లిన నిఖిల్ నెల రోజులు గడువు కావాలని కోరాడు. గత నెల 19న యువతిని ట్యాంక్ బండ్ వద్దకు తీసుకెళ్లి ఎలాంటి సాక్ష్యాలు లేకుండా చేసేందుకు ఆమె సెల్‌ఫోన్‌ను నిఖిల్ హుస్సేన్ సాగర్‌లో విసిరేశాడు. ఆమె సోదరుడు నిఖిల్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించగా వాగ్వివాదానికి దిగడంతో విసిగిపోయిన బాధిత యువతి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చిన్నమ్మ ఇంట్లో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

పంజాగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చిన్నమ్మ ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేసిన వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌కు చెందిన వెంకటేష్(35) ఈ నెల 7న పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌లో ఉంటున్న చిన్నమ్మ ఇంటికి వెళ్లాడు. చిన్నమ్మ కొడుకు నగేష్‌తో బిర్యానీ చేసుకుందామని చెప్పి అందుకు సంబంధించిన సామగ్రి తీసుకురమ్మని పంపించాడు. నగేష్ బయటికి వెళ్లిన వెంటనే వెంకటేష్ బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. నగేష్ వచ్చాక బిర్యానీ చేసుకుని తిన్నారు. ఆ తార్వత వెంకటేష్ వెళ్లిపోయాడు. కాసేపటి తరువాత నగేష్ తల్లి వచ్చి బీరువాలో చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో నగేష్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటేష్‌ను విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించాడు.

హనుమాన్ జయంతికి ఆలయాల ముస్తాబు

- ఈనెల 12న వేడుకలు
- బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీస్‌లు

సికింద్రాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న హనుమజ్జయంతి ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు జరుగనున్న శోభాయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాం గం ఏర్పాట్లు చేస్తోంది. వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ శోభాయాత్రను పురస్కరించుకొని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం అప్రమత్తమైంది. ప్యారడైజ్ జంక్షన్, బైసన్‌పోలో గ్రౌండ్, ఇంపీరియల్ గార్డెన్స్, సిక్ విలేజీ చౌరస్తాల మీదుగా సాగే భారీ ర్యాలీకి పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తోం ది. ఆలయం లోపల, ఆలయం పరిసరాల్లో ఇప్పటి నుంచే పోలీసు జాగిలాలు, పేలుడు పదార్థాల నిపుణులతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణ, రోడ్లపై గుంతలను పూడ్చడం, వీధి దీపాల సక్రమ నిర్వహణ, పార్కింగ్ వసతి తదితర ఏర్పాట్లలో కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం నిమగ్నమైంది. కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన ప్రత్యేక సమీక్ష సమావేశానికి కంటోన్మెంట్ ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్ హాజరయ్యారు. శోభాయాత్ర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై నిర్వాహకులతో చర్చించారు.



తాడ్‌బండ్ వీరాంజనేయస్వామి దేవస్థానం



తాడ్‌బండ్ వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

చెత్తాచెదారం తొలగింపుపై దృష్టి

ప్యారడైజ్ జంక్షన్ (బాలంరాయి పంప్‌హౌజ్) నుంచి ర్యాలీ కొనసాగే మార్గంలో చెత్తాచెదారం తొలగించడం, చిన్నపాటి గుంతలేమైనా ఉంటే వాటిని పూడ్చడం, వీధి దీపాలు సరిగ్గా వెలుగుతున్నాయో, లేదో పరిశీలించి, అవి సక్రమంగా పని చేసేలా చూడడం, వాహనాల పార్కింగ్‌కు వినియోగించే సిక్ విలేజీ హాకీ గ్రౌండ్‌ను సైతం సిద్ధం చేయడం తదితర పనులపై కంటోన్మెంట్ బోర్డు అధికారులు దృష్టి సారించారు. హనుమజ్జయంతి శోభాయాత్ర ప్రారంభం నుంచి ముగిసే వరకు 70 మంది పారిశుధ్య సిబ్బంది విధి నిర్వహణలో అందుబాటులో ఉండనున్నారు.

12 నుంచి 16వ తేదీ వరకు..

బౌద్ధనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చిలకలగూడలోని సాయిబాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఇప్పటికే ఈ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించారు.

చరిత్ర..

దాదాపు వంద సంవత్సరాల క్రితం చిలకలగూడలో గడ్డి చేలు, పొలాలు ఉండేవి. పొలం మధ్య ఉన్న బావిలో బాలుని రూపంలో ఆంజనేయస్వామి విగ్రహం దొరికింది. స్వయంభువుగా వెలిచిన అంజనేయుడికి బాలాంజనేయస్వామిగా నామకరణం చేశారు. చెట్టు కింద చిన్న పందిరి వేసి నిత్యం పూజలు చేసేవారు. స్థానిక వాసి నాగులూరి నర్సింహ ఒక చిన్నగుడిని కట్టించారు. తర్వాత వారి కుమారుడు నాగులూరి సాయిబాబా బాలాంజనేయస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేశారు. ఈ ఆలయ ప్రాంగణంలో షిర్డీసాయి బాబా, సంతోషి మాత, గణపతి, శివాలయం, ముగ్గురమ్మలు విగ్రహాలను ప్రతిష్ఠించారు.

ఐదు రోజులు ప్రత్యేక పూజలు

ఈనెల 12వ తేదీన హనుమజ్జయంతి ఉత్సవాల ప్రారంభం రోజున బాలాంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, తమలపాకులు, వివిధ పండ్ల అలంకరణలతో భక్తులకు దర్శనం ఇస్తారు. 13న చందన అలంకరణ, 14న వివిధ రకాల పండ్లు, పువ్వుల అలంకరణ, 15న తమలపాకుల అలంకరణ, 16న ధన అలంకరణతో పాటు ప్రతిరోజు సింధూర అలంకరణతో బాలాంజనేయ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వను న్నారు. వీటితో పాటు ప్రతిరోజు సుప్రభాతం, గణపతి పూజ, నిజాభిషేకం, సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, అర్చనలు, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో బాలాంజనేయస్వామి

ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



చిలకలగూడలోని సాయి బాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు బాలాంజనేయస్వామి వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ ఉత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కొన్ని సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

- నాగులూరి సాయిబాబా, ఆలయ చైర్మన్

రైల్వే స్టేషన్‌లో 58 కిలోల గంజాయి పట్టివేత



రైల్వే స్టేషన్‌లో గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైలులో సరఫార చేస్తున్న గంజాయిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ ఎస్సై రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్రకు కోనార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు 58 కిలోల గంజాయిని సరఫార చేస్తున్నారు. ఆ సమయలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌లో ఆగడంతో రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జనరల్ బోగిలో గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసుల కళ్లు తప్పి పారిపోయారు. బోగిలో బెర్తు కింద ఉన్న గంజాయి సరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర



కార్యక్రమంలో రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్

బౌద్ధనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్‌లో బుధవారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పాదయాత్రలో తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలతో భారత రాజ్యాంగ పుస్తకాలతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత, ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించేందుకు ఈ పాదయాత్రను చేపట్టామన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అణగదొక్కాలని చూస్తోందన్నారు. గాంధీ, అంబేడ్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను దేశంలో అమలుచేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు షకీల్‌ఖాన్, చక్రధార్, బబ్లూ, శ్రీకాంత్, బాబు మహేశ్, కిరణ్, తుమ్మరాజు, నాని, రాధా, గీతాంజలి, రజిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయం ఆవరణలో చెత్త వేయొద్దు


- ఎయిర్‌పోర్టు సమీపంలోని నివాసితులకు అవగాహన



భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎయిర్‌పోర్టు అధికారులు, శానిటేషన్ సిబ్బంది

బేగంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విమానాశ్రయం ఆవరణలో ఆహార వ్యర్థాలు, చెత్త వేయవద్దని ఎయిర్‌పోర్టు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. బేగంపేట ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు, బేగంపేట సర్కిల్ జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది విమానాశ్రయం సమీపంలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్, తాతాచారి కాలనీ, భగత్‌సింగ్‌నగర్ తదితర బస్తీలకు చెందిన ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. విమానాశ్రయం ప్రహరీ పక్కన ఉన్న బస్తీల ప్రజలు నిత్యం మిగిలిన ఆహార పదార్థాలతో పాటు చెత్తను గోడ అవతలకు విసిరేస్తున్నారని, దీనివల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు చెప్పారు. ఆహారం కోసం పక్షులు రావడంతో విమానాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. స్థానికులు సమస్యను గుర్తించి చెత్తను ఎయిర్‌పోర్టులోకి వేయవద్దని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన ఆటోలో చెత్తను వేయాలని, ఈ విషయంపై సర్కిల్ డీసీ డాకు నాయక్ పలుసార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని శానిటేషన్ అధికారులు ఎస్ఎస్ ధన గౌడ్, జవాన్ కృష్ణ తెలిపారు. ఈసందర్భంగా డప్పు వాయిస్తూ పలు బస్తీల్లోని ప్రజలను కలిసి అధికారులు అవగాహన కల్పించారు.

ఆత్మీయ వీడ్కోలు



పదన్నోతిపై దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, ప్రిన్సిపాల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్‌గా బాధ్యతలు చేపట్టనున్న టి.హేమసునీతకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న లేఖా భవన్ ఉద్యోగులు - చిలకలగూడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్ నాయకుడి మృతదేహానికి ఎమ్మెల్యేల నివాళి



నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బేగంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనే సత్యనారాయణ మృతి చెందడం బాధకరమని ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సి.సత్యనారాయణ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు కార్పొరేటర్ మహేశ్వరితో బుధవారం బేగంపేటలోని వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల వెంట బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, సురేష్‌యాదవ్, తాళ్ల రాజయ్య, నరేందర్‌రావు, నరేష్, సురేష్ ఉన్నారు.



భద్రాచలం సీతారామ చంద్రస్వామి ఆలయం తలంబ్రాలు, ప్రసాదాన్ని బుధవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌కు ఆయన నివాసంలో అందజేస్తున్న భద్రాచలం యువజన సంఘం ప్రతినిధులు - రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి)

ఆలయ నిర్మాణాలకు దాతలు సహకరించాలి



శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జంపన ప్రతాప్, టీఎన్ శ్రీనివాస్, మధుకర్

బోయినపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల నిర్మాణాలు, అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించి భాగస్వాములు కావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ పిలుపునిచ్చారు. బోయినపల్లి చిన్నతోకట్ట శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి మధుకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన పలు ఆలయాల పునర్నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని, ఆలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హన్మంత్ యాదవ్, సాయిబాబా యాదవ్, ముఖేష్ యాదవ్, కొండల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్‌గూడలో కార్పొరేటర్ పర్యటన



మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

బౌద్ధనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలో బుధవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. నాలా నుంచి మురుగునీరు రివర్స్ వస్తోందని, వెంటనే డ్రైనేజీ లైన్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కారించాలని స్థానిక మహిళలు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నాలా సమస్యను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ తెలిపారు. వేసవిలో మంచి నీటి ఇబ్బందులు తలెత్తకుండాచర్యలు తీసుకుంటామని తెలిపారు. జలమండలి మేనేజర్ నవ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీతాఫల్‌మండిలో పలు రేషన్‌షాపుల్లో కార్పొరేటర్ తనిఖీ చేశారు. నగరంలో ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున త్వరలో సన్నబియ్యం పంపిణీ చేస్తారని కార్పొరేటర్ తెలిపారు.

స్పీకర్‌కు ఆహ్వానం



సీతాఫల్‌మండి మధురానగర్ కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయ 9వ వార్షికోత్సవం ఈనెల 23న నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పవన్ కుమార్‌గౌడ్‌తో పాటు సభ్యులు ధనశేఖర్, సంగం జగదీశ్వర్, దేవేందర్, అర్చకులు శ్రీకాంత్ బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.
- బౌద్ధనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి)

మహా కుంభాభిషేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శివాజీనగర్‌లో ఉన్న వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయంలో మహా కుంభాభిషేక పూజలలో భాగంగా బుధవారం ద్వారాపూజ, చతుస్థానార్చన, సయనోన్మిలణం, మూరిహోమం, నిత్యహోమం ద్రవ్యహోమం, ప్రాయశ్చిత్తం, పూర్ణాహుతి, నివేదన, నీరాజనం, శాత్తుమొఱై పూజలు నిర్వహించారు. ఈనెల 11న మహా కుంభాభిషేకం జరగనుంది. ఈ పూజల్లో ఆలయ రినోవేషన్ కమిటీ చైర్మన్ నర్సారెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ కో ఆప్షన్ సభ్యులు నర్సింహా ముదిరాజ్, కార్పొరేటర్ కొంతం దీపిక, ఈవో సత్యమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



సీతాఫల్‌మండిలో బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

బౌద్ధనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఆ పార్టీ ముఖ్య నాయకులు తెలిపారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం సీతాఫల్‌మండిలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, నాయకులు కనకట్ల హరి, అంబాల రాజేశ్వర రావు, కరుణాకర్, కుమారస్వామి, సంపత్‌కుమార్, రత్నాకర్, డివిజన్ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని బతికించండి

- సీఈఓ మధుకర్ నాయక్‌కు మాజీ సభ్యుల వినతి



కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బతికించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు బి.అనితప్రభాకర్, నళినీకిరణ్, కె.పాండుయాదవ్, ప్యారసాని శ్యామ్‌కుమార్, లోకనాథం కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. కంటోన్మెంట్ చట్టం 2006 సెక్షన్ 12(3)(జి) ప్రకారం కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలని, ఐదు సంవత్సరాలుగా బోర్డు ఎన్నికలు జరపకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని వారు తెలిపారు. దీంతో సామాన్య ప్రజలకు పరిపాలన సౌలభ్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కాగా 8వ వార్డులోని రిసాలాబజార్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, తక్షణమే హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు కోరారు. 6వ వార్డులోని రామన్నకుంట చెరువును ప్రక్షాళన చేయాలని, 3,4,7వ వార్డుల్లో దివంగత ఎమ్మెల్యే సాయన్న, లాస్య నందిత హయాంలో నిధులు మంజూరయ్యాయని, అభివృద్ధి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్‌లోని మొత్తం 8 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్లను విడుదల చేసి, భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, రానున్న వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ యువ నాయకుడు బి.సాయికిరణ్ పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాస్ దరఖాస్తులను అందజేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ సాయికుమార్

బోయినపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకునేవారు తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని రాజీవ్ యువ వికాస్ పథకం తిరుమలగిరి మండల ఇన్‌చార్జి ఆర్డీవో సాయికుమార్ ప్రజలకు సూచించారు. బుధవారం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ దరఖాస్తులను అందుబాటులో ఉన్న వార్డు కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తే సంబంధిత అధికారులు దరఖాస్తులను స్క్రూటినీ చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కార్పొరేషన్ కార్యాలయాలకు పంపించి ప్రభుత్వానికి నివేదికలు అందజేయడానికి కృషి చేస్తామన్నారు. తిరుమలగిరి మండలంలో ఇప్పటివరకు 1290 మంది దరఖాస్తు చేసుకోగా, తహసీల్దార్ కార్యాలయంలో 300 దరఖాస్తులు వచ్చాయని, మిగతా లబ్ధిదారులు తమ దరఖాస్తులను తహసీల్దా ర్ కార్యాలయంలో అందజేస్తే పథకానికి సంబంధించిన వారి జాబితాను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. మీ-సేవాల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకు న్న వారు దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. లేదంటే దరఖాస్తులు రిజెక్ట్ అవుతాయని తెలిపారు. డీటీ హారిక, ఆర్ఐ సునీల్, కంటోన్మెంట్ మెప్మా అధికారి ప్రకాష్, ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల అధికారులు పాల్గొన్నారు.

ఇంట్లో దొంగతనం.. వ్యక్తి అరెస్ట్

బౌద్ధనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్శీగుట్ట సంజీవపురంలో నివశించే ఆరిక్షిత జెన్నా తాపీమేస్త్రీ. ఈనెల 4న గుర్తుతెలియని వ్యక్తి, జెన్నా ఇంట్లోకి చొరబడి పదిహేను గ్రాముల బంగారు నగలు, మొబైల్ ఫోన్‌తో పాటు అల్మారాను పగులగొట్టి విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడు. బాధితుడు అదేరోజు వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమోరాల ద్వారా నిందితుడు ధర్మారావు(20)గా గుర్తించారు. మంగళవారం రాత్రి ధర్మారావును వారాసిగూడలో అరెస్ట్‌చేసి అతని నుంచి విలువైన వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

పెళ్లి సామగ్రి బుగ్గిపాలు



సామగ్రి కాలిపోయిన గదిని పరిశీలించిన కార్పొరేటర్ కందిశైలజ

బౌద్ధనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కుమార్తె పెళ్లికోసం దాచిన సామన్లు బుగిపాలయ్యాయి. బౌద్ధనగర్‌లో నివశించే భానుకుమార్తె పెళ్లి మే 10న జరుగనుంది. పేదవారు కావడంతో అప్పుడప్పుడు వచ్చిన డబ్బులతో సామగ్రి కొన్ని ఇంటిపైన ఉన్న రూమ్‌లో దాచిపెట్టేది. బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గదిలో మంటలు వ్యాపించి దాచిన పెళ్లి సామగ్రి కాలిపోయాయి. విషయం తెలిసిన బౌద్ధనగర్ కార్పొరేటర్ కందిశైలజ, ముషీరాబాద్ మండల ఆర్ఐ రాజేశ్, నాయకులు బెజ్జంకి రాజేష్, బాబా, అహ్మద్, విద్యుత్ శాఖాధికారులు, తదితరులు కాలిన గదిని పరిశీలించారు. ఇంటి యజమాని వృద్ధురాలు భానుతో కార్పొరేటర్ మాట్లాడి అన్ని విధాల అదుకుంటామని తెలిపారు.

అనారోగ్యంతో ఫిజియోథెరపిస్ట్ మృతి

అమీర్‌పేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఫిజియోథెరపీ వైద్యురాలు మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన సుస్మిత ప్రియ(30) సంవత్సరం నుంచి ఎస్ఆర్‌నగర్‌లోని ఉమెన్స్ హాస్టల్లో ఉంటూ బల్కంపేటలోని ఓ చైల్డ్‌కేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఫిజియోథెరపీ వైద్యురాలిగా పనిచేస్తోంది. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం 8 గంటలకు హాస్టల్ నుంచి విధులకు బయలుదేరుతుండగా నురగలు కక్కుతూ ఒక్కసారిగా కింద పడిపోయింది. హాస్టల్ నిర్వాహకులు 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నగరానికి చేరుకున్న ఆమె తల్లితండ్రులు తన కుమార్తెకు గుండె సంబంధిత సమస్య ఉందని పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బైశాఖి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

అమీర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గురుద్వారా ఆధ్వర్యంలో ఈనెల 13నుంచి నిర్వహించనున్న బైశాఖి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారితో కలిసి ప్రబంధక్ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. ఉత్సవాలకు వేలాది మంది సిక్కులు వచ్చే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు చెప్పనున్నట్లు తెలిపారు.